## క్లుప్తంగా

### పుకార్లు నమ్మొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారి

**ఝరాసంగం(జహీరాబాద్):** గ్రామాల్లో పులి సంచారంపై సోషల్ మీడియాల్లో వస్తున్న పుకార్లను నమ్మొద్దని అటవీశాఖ అధికారి ఇనియాత్‌అలి అన్నారు. మండల పరిధిలోని సిద్దాపూర్, చీలపల్లి గ్రామ శివారుల్లోని పంట పొలాల్లో పులి సంచరిస్తుందని సోషల్ మీడియాలో వచ్చిన వీడియోలు, ఫిర్యాదులకు స్పందించిన అధికారులు మంగళవారం ఆయా గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించి పులి సంచారం అవాస్తవమని తేల్చారు. గ్రామస్తులు ఆందోళనకు గురికావొద్దని సూచించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎలాంటి వార్తలు షేర్ చేయవద్దన్నారు.

### నీలం మధుకు ఘన స్వాగతం

**పటాన్‌చెరు టౌన్:** నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపికై ఢిల్లీ నుంచి పటాన్‌చెరుకు చేరుకున్న నీలం మధు ముదిరాజ్‌కు ఆ పార్టీ శ్రేణులు మంగళవారం అపూర్వ స్వాగతం పలికాయి. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా భారీ ర్యాలీతో ముత్తంగికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఓపెన్ టాప్‌కార్‌లో ప్రజలకు అభివాదం చేస్తూ భారీ ర్యాలీగా రుద్రారంలోని గణేష్‌గడ్డ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాలకు పూజలు నిర్వహించి జెండా ఊపి ప్రచార రథాలను ప్రారంభించారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ సలహాలతో ఎన్నికల సంగ్రామంలో ముందుకువెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎంఆర్ యువ సేన నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

### ఓటుహక్కుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

**జిన్నారం(పటాన్‌చెరు):** ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ఆర్‌ఓ శ్రీధర్‌ల ఆధ్వర్యంలో బొల్లారం మున్సిపల్ పరిధిలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు ఓటు విలువను ప్రజలకు వివరించారు.

### స్కూల్ బస్సులను సీజ్ చేయాలి

**జహీరాబాద్ టౌన్:** నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న స్కూల్ బస్సులను సీజ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీఓ జయప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల బలహీనతను ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటునాయన్నారు. ఫిట్నెస్, రిజిస్ట్రేషన్ లేని బస్సుల్లో విద్యార్థులను తరలిస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ఫిట్నెస్, రిజిస్ట్రేషన్ బస్సులను గుర్తించి వెంటనే సీజ్ చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పీడీఎస్‌యూ నాయకులు ఆకాశ్, శంకర్, కోటేశ్వర్‌రావు, పాల్‌రాజ్ ఉన్నారు.

### వాహనాల తనిఖీ

**జిన్నారం(పటాన్‌చెరు):** మండల పరిధిలోని గురుకుల పాఠశాల ప్రధాన కూడలి వద్ద ఎన్నికల అధికారులతో పాటు పోలీసులు వాహనాలను తనిఖీలు చేశారు. అదేవిధంగా బొల్లారం మున్సిపల్ పరిధిలోని రింగురోడ్డు సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీలు చేశారు.

### హెచ్‌ఐవీ రక్త పరీక్షలు

**జిన్నారం(పటాన్‌చెరు):** బొల్లారం మున్సిపల్ పరిధిలో బీరప్పబస్తీలో కార్మికులు, ప్రజలకు స్కోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ ఉచిత రక్త పరీక్షలను మంగళవారం నిర్వహించారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ ప్రతినిధి ఉప్పలయ్య సూచించారు. హెచ్‌ఐవీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శారద తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరికలు

**వట్‌పల్లి(అందోల్):** బీఆర్‌ఎస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ అన్నారు. మండలంలోని మంచిర్యాల తండా, మర్వెల్లి గ్రామాలకు చెందిన పలువురు మంగళవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ దీప్లానాయక్, ఎంపీటీసీ సంగన్న తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో..**

**నారాయణఖేడ్:** నిజాంపేట్ మండల పరిధిలోని దామర్‌చెరువుకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఖేడ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు.

# పరిశ్రమలకు స్వర్గధామం

- పటాన్‌చెరు పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులు
- కార్మికుల సంక్షేమానికి పెద్దపీట
- కేసీఆర్ కృషితోనే గిరిజనుల అభ్యున్నతి
- నియోజవర్గం అభివృద్ధే లక్ష్యం
- బీఆర్‌ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి



ఫాండ్రీస్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు:** సీఎం కేసీఆర్ నాయకత్వంలో పరిశ్రమలకు స్వర్గధామంగా పటాన్‌చెరు నియోజకవర్గం రాష్ట్రానికి తలమానికంగా నిలిచిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని పాటి గ్రామ చౌరస్తాలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన పటాన్‌చెరు ఫాండ్రీస్ అసోసియేషన్ సమావేశానికి శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగా పారిశ్రామికరంగం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సులభతర వాణిజ్య విధానం తీసుకొచ్చి నూతన పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో నేడు 6వేలకు పైగా పరిశ్రమలు వివిధ ఉత్పత్తులను కొనసాగిస్తూ అనేకమంది కార్మికులకు ఉపాధిని కల్పిస్తున్నాయని వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు అంజయ్య, శంకర్‌యాదవ్, అసోసియేషన్ ప్రతినిధులు ఆనందరెడ్డి, వెంకటేశ్వర్లు, ఐలా అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి రంజిత్ భారీసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

**కులవృత్తులకు జీవం..**

ఉనికి కోల్పోతున్న కులవృత్తులకు జీవం పోసిన మహోన్నత నాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్‌లో ఏర్పాటుచేసిన నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ విజయానికి తోడ్పాటును అందించాలని కోరారు. అనంతరం నాయీ బ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్‌ఎస్‌కే తమ మద్దతు అని సంఘం ప్రతినిధులు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహాగౌడ్, సీనియర్ నాయకులు, సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం**

**పటాన్‌చెరు టౌన్:** నియోజకవర్గంలోని ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల అనంతరం ఫొటోగ్రాఫర్ల భవన నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అనిల్, మాజీ అధ్యక్షుడు కృష్ణయాదవ్, పవన్, శంకర్ పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం



అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ప్రచారం నిర్వహిస్తున్న తుమ్మల పాండురంగారెడ్డి

**పటాన్‌చెరు:** బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం,అభివృద్ధి సాధ్యమని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలో 2, 7వ వార్డుల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారు గుర్తుపై ఓటు వేసి మహిపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు కృష్ణ, రాజు, కల్పనమహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యువ నాయకులు తుమ్మల రష్వంత్‌రెడ్డి, నాయకులు మాధవరెడ్డి, సిద్దిపేట రాంరెడ్డి, భిక్షపతి, సిద్దిపేట శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, నాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు



కొల్లూరు దేవులపల్లి తండావాసులతో ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

**తండాల అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే**

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** తండాలను గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్ది అభివృద్ధి చేసిన మహోన్నత నాయకుడు సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు దేవులపల్లితండాలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండాకు చెందిన 100 మందికిపైగా బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని నడిబొడ్డున గిరిజనుల ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, వైస్‌చైర్మన్ రాములుగౌడ్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**సముచిత స్థానం కల్పిస్తాం**

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** బీఆర్‌ఎస్‌లో చేరిన ప్రతిఒక్కరికీ సముచితస్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ, బీహెచ్ఇఎల్ కాలనీలకు చెందిన అశ్విత్, శ్రీనివాస్, భాను, హరికృష్ణ ఆధ్వర్యంలో 120 మంది యువకులు మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రమోద్‌గౌడ్ పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన లక్ష్మీపతిగూడెం ఉపసర్పంచ్ అశోక్, కాంగ్రెస్ నాయకులు

**బీఆర్‌ఎస్‌లో చేరిన ఉపసర్పంచ్**

**జిన్నారం(పటాన్‌చెరు):** మండల పరిధిలోని లక్ష్మీపతిగూడెం ఉపసర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మామిడిపల్లి అశోక్, కొర్లకుంట కేసీజీ యువసేన నాయకులు రాజు, మామిడిపల్లి రమేష్, తదితరులు ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. నాయకులు వెంకటేష్‌గౌడ్, నల్తూరు సర్పంచ్ జనార్దన్, పార్టీ మండల అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు మేతగా పంటలు

- ఆందోళనలో రైతులు
- పశువుల సంచారాన్ని అరికట్టాలని విన్నపం



ఆలు పంటను ధ్వంసం చేస్తున్న పశువులు

**జహీరాబాద్ టౌన్:** పశువులు పంట పొలాలను ధ్వంసం చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పట్టణ పరిధిలోని పస్తాపూర్ రైతులు ఆలు, చెరకు తదితర పంటలను పండిస్తున్నారు. అయితే పశువులు గుంపు గుంపులు వచ్చి పంట పొలాలపై ధ్వంసం చేస్తున్నాయి. రాత్రి పగలు తేడా వస్తున్నాయని, పశువుల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఆలు పంట పూర్తిగా దెబ్బతిందని, దీంతో వేల రుపాయలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పశువులు పంట పొలాల వద్దకు రాకుండా గోశాలకు తరలించాలని రైతులు కోరుతున్నారు.

### దత్తగిరి ఆశ్రమంలో ఢిల్లీ వసంత్ పూజలు

**ఝరాసంగం(జహీరాబాద్):** జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో బీజేపీ నేత, సామాజిక ఉద్యకారుడు ఢిల్లీ వసంత్ పూజలు చేశారు. మంగళవారం ఆశ్రమానికి వచ్చిన ఆయనకు ఆశ్రమ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని జ్యోతిర్లింగాల వద్ద అభిషేకం, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతులతో కలిసి మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలోని చక్కెర పరిశ్రమను కాపాడుకోవాలన్నారు. గత బకాయిలతో కాకుండా ఇప్పటివరకు క్రషింగ్ ప్రారంభం కాకపోవటంతో రైతులు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్దేశ్వర స్వామి, నాయకులు పాల్గొన్నారు.

### సిద్ధేశ్వర ఆలయ దుకాణం లీజుకు రేపు వేలం

**కంగ్టి(నారాయణఖేడ్):** కంగ్టి గ్రామ శివారులోని సిద్దేశ్వర ఆలయానికి చెందిన దుకాణం (గ్రామంలోని గణేష్ మందిరం వద్ద కలదు) రెండు సంవత్సరాల కోసం లీజుకై వేలం వేయనున్నట్లు దేవాదాయశాఖ ఈఓ శివరుద్రప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్ ఆలయం ప్రాంగణంలో గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు వేయనున్న బహిరంగ వేలంపాటలో ఆసక్తిగలవారు రూ.10 వేల దరావత్తు చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

### జాతీయ క్రికెట్ జట్టుకు హర్షిత్

**శివ్వంపేట(నర్సాపూర్):** మండల పరిధి ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన కల్లూరి హర్షిత్ జాతీయ క్రికెట్ టీంకు ఎంపికయ్యాడు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్-17 క్రికెట్ పోటీలు ఈ నెల 4 నుంచి 7 వరకు ఒడిసా రాష్ట్రంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి తెలంగాణ ఆంధ్రప్రదేశ్ జట్టులో కల్లూరి హర్షిత్ పాల్గొన్నాడు. బౌలింగ్, ఫీల్డింగ్‌లో ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి అండర్-17 జట్టులో చోటు దక్కించుకున్నాడు.

### పేకాట స్థావరంపై దాడులు

నాలుగు బైకులు, 10 సెల్‌ఫోన్‌లు, రూ.78 వేల నగదు స్వాధీనం


**పటాన్‌చెరు టౌన్:** పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సంఘటన పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగిలో చోటుచేసుకుంది. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్, ఎస్ఐ సాయిలు, సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం విశ్వసనీయ సమాచారం మేరకు ముత్తంగి న్యూటన్ కాలనీలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో లేబర్ కాంట్రాక్టర్ భాస్కర్‌రావుతో పాటు మరో ఏడుగురిని అదుపులో తీసుకొని నాలుగు బైకులు, 10 సెల్‌ఫోన్‌లు, రూ. 78,830 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

### అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**పటాన్‌చెరు టౌన్:** అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్లకు చెందిన మన్యం కార్తీక్(31) బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీకి వచ్చి ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కార్తీక్‌కు అప్పులు ఉండటంతో అతని అత్తమ్మ గతంలో అప్పులను తీర్చారు. అయినప్పటికీ మళ్లీ అప్పులు తీవ్రం కావడంతో ఈ నెల 6వ తేదీన అర్ధరాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు మృతుడి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం మృతుడి సోదరుడు కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఔషధాల తయారీలో చెట్ల వినియోగం

ప్రొఫెసర్ డాక్టర్ శంకరస్వామి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు

**నర్సాపూర్:** ఔషధాల తయారీలో పలు రకాల చెట్లను వినియోగిస్తారని కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర హార్టికల్చర్ యూనివర్సిటీ అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ శంకరస్వామి చెప్పారు. మంగళవారం నర్సాపూర్‌లోని విష్ణు ఫార్మసీ కాలేజీలో హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా రెండో రోజు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పలు రకాల చెట్ల ప్రాముఖ్యత, వాటి ఉపయోగాల గురించి వివరించారు. అనంతరం ప్రోగ్రాం సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సస్యవార్త ఫౌండర్ సూరజ్‌వర్మ మంతెన, బీవీఆర్ఐటీ కాలేజీ హెచ్‌ఓడీలు డాక్టర్ నీలాద్రి శేఖర్, మురళీకృష్ణ, ముత్తాలుగు, ప్రిన్సిపాల్ రమేష్, ప్రోగ్రాం కన్వీనర్ వనిత, కో ఆర్డినేటర్ దినేష్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# జగ్గారెడ్డి మాటలను నమ్మొద్దు

డీసీసీబీ వైస్‌చైర్మన్ మాణిక్యం

**సంగారెడ్డి:** ఎమ్మెల్యే జగ్గారెడ్డి మోసపూరిత హామీలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని డీసీసీబీ వైస్ చైర్మన్, ఎన్నికల టీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ పట్నం మాణిక్యం అన్నారు. సంగారెడ్డిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఆమలుకు సాధ్యంకాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఎమ్మెల్యేగా గెలుపొందిన జగ్గారెడ్డి ప్రజా సమస్యలను గాలికొదిలేసి నగరానికే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. తనను గెలిపిస్తే 40వేల మందికి ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని చెప్పి ప్రజలను మోసగించారని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చే ఆసరా పెన్షన్లతో పాటు తాను అదనంగా రూ.500 ప్రతి నెలా ఇస్తానని వృద్ధులను మోసగించారన్నారు. జగ్గారెడ్డిని ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీరవి, బీఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ శ్రీహరి, విజయేందర్‌రెడ్డి, ఆత్మకూర్ నగేష్, నసీర్, నాగేష్, లియాకత్ అలీ, పెరుమాళ్ల నర్సింహులు, జలిందర్రావు, శ్రావన్‌రెడ్డి పాల్గొన్నారు.

# పోస్టల్ సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న అధికారులు

**నర్సాపూర్‌రూరల్:** పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లోని సేవలను ప్రతి ఇంటింటి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని సంగారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ సంపత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ ఎంపీపీ సమావేశ మందిరంలో తపాలా సేవల సమీకృత సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారి అవసరాలకు అనుగుణంగా తపాల సేవలను విస్తరించాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్క తపాల ఉద్యోగిపై ఉందని అన్నారు. ఈ మేరకు వివిధ పోస్టల్ పథకాలపైన ఉద్యోగులు అవగాహన పెంచుకొని గ్రామీణ ప్రజలతో మమేకమై వారిని పొదుపు పథకాల్లో భాగస్వామ్యం చేయాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. పసికందు నుంచి సీనియర్ సిటిజన్స్ వరకు వివిధ పొదుపు స్కీములు, ఇన్సూరెన్స్ పథకాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో సంగారెడ్డి సబ్ డివిజన్ ఎంటలు డి.శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

# న్యాయం చేయాలి

**సంగారెడ్డి:** తన పొలంలోకి వచ్చి దౌర్జన్యంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను కూల్చివేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డికి చెందిన రాజేశ్వర్‌చౌహాన్ అధికారులను కోరాడు. సంగారెడ్డి లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తనకు ఝరాసంగం మండలంలోని తుమ్మనపల్లిలో 67 సర్వే నెంబర్‌లో 15 ఎకరాల 15 గుంటల భూమి ఉందన్నారు. ఇందులో 11గంటలు కబ్జా చేసి బీదర్‌కు చెందిన వసియొద్దీన్ అక్రమంగా రైస్‌మిల్ నిర్మిస్తున్నారని గ్రీవెన్స్‌లో డీపీఓకు, కలెక్టర్ నుంచి కింది స్థాయివరకు అందరికీ ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ క్రమంలో రైస్‌మిల్ నిర్మాణం కూల్చాలని ఫైనల్ నోటీస్ సైతం ఇచ్చారని, ఫైనల్ నోటీస్ ఇచ్చినా ఇంతవరకు రైస్‌మిల్ కూల్చడంలేదన్నారు. తనకు న్యాయం చేయాలని కోరాడు. లేనిపక్షంలో కోర్టుకు వెళ్తానని తెలిపాడు.

# కమ్యూనిస్టుల సత్తా చూపిస్తాం

సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్



మాట్లాడుతున్న జలాలోద్దీన్

**జహీరాబాద్ టౌన్:** రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టుల సత్తా చూపిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్ అన్నారు. బాగారెడిపల్లికి చెందిన నర్సింలు ఎంసీపీఐ నుంచి మంగళవారం సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజల సమస్యలను గాలికి వదిలేశాయని ఆరోపించారు. సీపీఐ ఎల్లప్పుడు ప్రజల పక్షాన ఉంటూ పోరాటాలు చేస్తోందన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో సీపీఐకి పెద్దగా కార్యకర్తలు లేకున్నా ప్రజల మద్దతు ఉందన్నారు. పేదల కోసం రాజీలేని పోరాటాలు చేస్తున్న తమను ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. అనంతరం పార్టీలో చేరిన నర్సింహులుకు కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అజారోద్దీన్, అఫ్జల్, శంకర్, రాజు, సుధాకర్, సంజీవ్, మొగులయ్య, శాంతమ్మ అమృతమ్మ, అనితమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి

**కొండాపూర్(సంగారెడ్డి):** రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని డీసీసీ అధ్యక్షురాలు నిర్మలజయప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మునిదేవునిపల్లి, గుంతపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే జగ్గారెడ్డి 20 ఏళ్లుగా గెలిచినా, ఓడినా ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజాసేవకే అంకితమయ్యారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభు, ఎంపీపీ మనోజ్‌రెడ్డి, కొండాపూర్ ఎంపీటీసీ నరసింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లారెడ్డి, పార్టీ యువజన మండల అధ్యక్షులు సునీల్, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అభ్యర్థులకు అండగా ద్వితీయ శ్రేణి నాయకులు**

**సదాశివపేట(సంగారెడ్డి):** పోలింగ్‌కు 23 రోజుల సమయం ఉన్నా ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు పార్టీల ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు బృందాలుగా విడిపోతున్నారు. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణులు జిల్లాలోని 8 మున్సిపాలిటీలు, 647 గ్రామ పంచాయతీల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కేటాయింపులో ఆలస్యం జరుగుతుండడంతో ప్రచారం ఇంకా ప్రారంభించలేదు.

### కాంగ్రెస్‌లో పుల్‌కల్ సర్పంచ్ శ్రావణ్‌కుమార్ చేరిక

**పుల్‌కల్(అందోల్):** పుల్‌కల్ గ్రామ పంచాయతీ సర్పంచ్ దప్పూరి శ్రావణ్‌కుమార్, ముద్దాయిపేట మాజీ సర్పంచ్ పీజీ మానేయ్య మంగళవారం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరాడు. వీరికి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దామోదర కూతురు త్రిష కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, కమల్‌రెడ్డి పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

**కంది(సంగారెడ్డి):** బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. మంగళవారం బేగంపేట్, ఆరుట్ల, చిద్రుప్ప, ఎర్దనూర్, ఎర్దనూర్ తండాలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డి, సరళప్పల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూదన్రెడ్డి, సాయగౌడ్ రాంరెడ్డి, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అభివృద్ధిని చూసే ఓటేయ్యండి**

**న్యాల్‌కల్(జహీరాబాద్):** బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని చూసే ఓటేయ్యాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వైస్‌ఎంపీపీ గౌసోద్దీన్ అన్నారు. మండల పరిధిలోని న్యామతాబాద్, ఖలీల్‌పూర్, మిర్జాపూర్(బి)తదితర గ్రామాల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు భాస్కర్, శ్రీకాంత్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, బక్కారెడ్డి పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే మాణిక్‌రావుకు మద్దతుగా..**

**జహీరాబాద్ టౌన్:** ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావును గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణ, ఆత్మకమిటీ చైర్మన్ పెంటారెడ్డి, సొసైటీ చైర్మన్ మచ్చేందర్, నాయకులు ముర్తుజా, తాజోద్దీన్, హీరూ రాథోడ్, గోవింద్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని దిడిగి, కొత్తూర్ (బి) బూచినెల్లి, బుర్దిపాడ్, సత్వార్, చిరాగ్‌పల్లి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

# సృజనాత్మకతను పెంపొందించాలి




మాట్లాడుతున్న ఆర్‌జేడీ మోతి

**పటాన్‌చెరు టౌన్:** అంగన్‌వాడీ పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించడం, విద్య ప్రమాణాలు మెరుగుపరిచేందుకే టీఎల్‌ఎం(టీచింగ్, లెర్నింగ్, మెటీరియల్) మేళా ముఖ్య ఉద్దేశమని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మోతి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని మున్నూరు కాపు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్ల టీఎల్‌ఎం మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు చేసిన మ్యూజిక్ అండ్ మూమెంట్, సృజనాత్మకత, చదవటం, రాయటం, మేధావి అభివృద్ధి స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మ్యూజిక్ అండ్ మూమెంట్ బోధనతో పిల్లల్లో సృజనాత్మకత పెంపొందడంతో పాటు చురుగ్గా తయారవుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి సంధ్యారాణి ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ, అజీమ్‌ప్రేమ్‌జీ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.